క్లుప్తంగా

రేపు మెగా వైద్య శిబిరం

సామర్లకోట: పట్టణంలోని బ్రౌన్‌పేటలో ఉన్న లిటిల్ ఏంజిల్ పాఠశాల ఆవరణలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సప్పా రామారావు తెలిపారు. సీఎస్ రత్నం రాజు క్లినిక్, అనన్య డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. డాక్టర్ ఐవీ రావు, డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, డాక్టర్ సీవీ రావు, డాక్టర్ సన్యాసిరాజు, డాక్టర్ సాయిలక్ష్మి, డాక్టర్ నిశాంత్, డాక్టర్ సిద్ధార్థ్, డాక్టర్ వల్లీ సేవలందిస్తారని చెప్పారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జావెలిన్, డిస్కస్ త్రోల్లో చాందిని ప్రథమం



చాందినితో ఫిజికల్ డైరెక్టర్ జయలక్ష్మి

సామర్లకోట: రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో సామర్లకోట మండలం, నవర జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన చాందిని జావెలిన్ త్రో, డిస్కస్ త్రోల్లో ప్రథమ బహుమతి సాధించిందని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సత్యవతి తెలిపారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ జయలక్ష్మి, విద్యార్థిని చాందినిని హెచ్‌ఎం, విద్యా కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు అభినందించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: ప్రముఖ పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ హుండీల లెక్కింపు సందర్భంగా స్వామివారి ఆలయానికి గత ఏడాది కంటే ఆదాయం ఎక్కువగా రావడంతో, నవమిని పురస్కరించుకుని ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిదిరాజు వెంకటరమణ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

సినిమాలు



పెద్దాపురం

లలితా స్క్రీన్–1	వీనమ్
లలితా స్క్రీన్–2	దేవర పార్ట్–1
వీరభద్ర	లగ్గం
శోభా	పొట్టేల్

సామర్లకోట

అనుశ్రీ స్క్రీన్–1	దేవర పార్ట్–1
అనుశ్రీ స్క్రీన్–2	జనక అయితే గనక
విఘ్నేశ్వర	వీనమ్

పిఠాపురం

అన్నపూర్ణ	గ్యాంగ్ స్టార్
శ్రీపూర్ణ	దేవర
శ్రీసత్య	సత్యం సుందరం
శ్రీవెంకటేశ్వర	మిస్టర్ సెలబ్రిటీ

ఉప్పాడ

శ్రీనివాస	దేవర

వెలిగితే దీపం.. ఆరిపోతే ధూపం

- గోమయ ప్రమిదలకు పెరుగుతున్న గిరాకీ
- దుర్గాడలో కుటీర పరిశ్రమగా తయారీ
- దీపావళికి సిద్ధమవుతున్న ప్రమిదలు

పిఠాపురం: దివ్వెల పండుగ దీపావళి వస్తుందంటే చాలు ప్రమిదలకు ఎనలేని గిరాకీ వస్తుంది. సాధారణంగా మట్టితో తయారు చేసిన ప్రమిదలను విక్రయిస్తుంటారు. కాని గత కొన్నేళ్లుగా వివిధ ఆకృతుల్లో అందంగా ఆకర్షణీయంగా తయారు చేసి విక్రయిస్తున్న ప్రమిదలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు వివిధ రంగుల్లో ఎల్‌ఈడీ బల్బులు అందుబాటులోకి రావడంతో కొందరు వాటిని వినియోగిస్తున్నారు. కాగా ఇటీవల గోమయంతో తయారు చేసిన ప్రమిదలకు ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో మట్టి, గోమయంతో తయారు చేసిన ప్రమిదలను విక్రయిస్తున్నారు.

గొల్లప్రోలు మండలంలో గోమయ ప్రమిదల తయారీ

సాంబ్రాణి ధూపం వేసి నూనెతో దీపం వెలిగించి స్వామి వారికి వండి వార్చిన నైవేద్యం సమర్పిస్తారు. దానినే దేవుని గుడిలో ధూపదీపనైవేద్యాలు అంటారు. ఇత్తడి రాగి కంచు బంగారం వెండి తదితర వాటితో తయారు చేసిన కుందుల్లో దీపాలు వెలిగిస్తుంటారు. కాని ప్రస్తుతం గోవు పేడ (గోమయం)తో తయారు చేసిన ప్రమిదలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటిలో నూనె పోసి దీపం వెలిగిస్తే నూనె ఉన్నంత సేపు దీపం వెలుగుతుంది. నూనె అయిపోగానే ఒత్తు కాలి తద్వారా ప్రమిద కూడా కాలి ధూపంగా మారుతుంది.



గోమయ ప్రమిదలు



దుర్గాడలో గోమయ ప్రమిదలు తయారు చేస్తున్న మహిళ

గోమయంతో తయారు చేసిన ప్రమిద దీపంగాను, ధూపంగానూ పని చేస్తుండడంతో వీటిని ఉపయోగించేందుకు భక్తులు ప్రాధాన్యం ఇస్తున్నారు. కేవలం చేతితో మాత్రమే తయారు చేస్తుండగా కొందరు వివిధ ఆకృతుల్లోనూ వీటిని తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రకృతి వ్యవసాయ క్షేత్ర నిర్వాహకుడు గుండ్ర శివ చక్రం తన ఇంటి వద్ద కుటీర పరిశ్రమగా గోమయ ప్రమిదల తయారీ చేపట్టారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి సైతం వీటికి ఆర్డర్లు వస్తుండడంతో వీటి తయారీ మరింత ఊపందుకుంది.

గోమయ ప్రమిదలో దీపం ప్రకృతి వరం



గోమయంతో తయారు చేసిన ప్రమిదలో దీపం వెలిగిస్తే పుణ్యానికి పుణ్యం, ఆరోగ్యానికి ఆరోగ్యం వస్తుంది. దీనిలో దీపం వెలిగించడం వల్ల వచ్చే కాంతి ఆరోగ్యానికి మంచిది. అలాగే ఇది కాలడం వల్ల వచ్చే ధూపం ఇంటి పరిసరాల్లోకి క్రిమికీటకాదులు రాకుండా నిలువరించి మంచి ఆరోగ్యకారిగా పని చేస్తుంది. ప్రకృతి వ్యవసాయంలో ఎక్కువగా గోమయం ఉపయోగిస్తుంటాం. దీనితో ఇటీవల ప్రమిదలు తయారు చేయడం ప్రారంభించాం. వీటిని ఆన్‌లైన్‌లో పెట్టడంతో మంచి గిరాకీ ఏర్పడింది. ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి వస్తున్న రైతులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి సుమారు 30 వేల ప్రమిదలు తయారు చేశాం.

– గుండ్ర శివచక్రం, ప్రకృతి వ్యవసాయ క్షేత్ర నిర్వాహకుడు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

ప్రమిదల తయారీ ప్రారంభించాం



ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గొల్లప్రోలు మండలం దుర్గాడలో గోమయ ప్రమిదల తయారీ ప్రారంభించాం. తొలుత స్థానికంగా ఉపయోగపడేలా చేయగా ప్రస్తుతం బయటి నుంచి ఆర్డర్లు వస్తుండడంతో వీటిని ఎక్కువ మంది తయారు చేసేలా ప్రోత్సాహిస్తున్నాం. ప్రస్తుతం కొన్ని గృహాల్లో వీటిని తయారు చేస్తున్నారు. వీటి తయారీని పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎలియాజరు, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి, కాకినాడ

గణితంలో మంచి పట్టు సాధించాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: పదో తరగతి విద్యార్థులు గణితంలో మంచి పట్టు సాధిస్తే నూటికి నూరు మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుందని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ప్రత్యేక తరగతులు, రెమిడియల్ క్లాసులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ స్థాయి వరకు ప్రతి విద్యార్థి భాషా నైపుణ్యాలతో పాటు, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. పరీక్షలలో చేతిరాతకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. అన్ని ప్రశ్నలకు కరెక్టుగా సమాధానాలు రాసినా, పూర్తి స్థాయిలో మార్కులు రాకపోవడానికి చేతిరాత ఒక కారణమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కాపీ రైటింగ్ చేయాలన్నారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక తరగతులలో బి శ్రీలక్ష్మి, బి. బేబీరాణి పాల్గొన్నారు.

వ్యాసరచనలో ‘కోట’ విద్యార్థినికి ప్రథమ స్థానం



కలెక్టర్ షణ్మోహన్ నుంచి ప్రథమ బహుమతి అందుకుంటున్న భవ్యశ్రీ



కలెక్టర్ నుంచి నగదు బహుమతి అందుకుంటున్న వెంకటలక్ష్మి

సామర్లకోట: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సేవ్ ద గర్ల్ చైల్డ్ అనే అంశంపై జిల్లా వైద్యారోగ్య శాఖ నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని కె.భవ్యశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఈ వివరాలు తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ సగిలి చేతుల మీదుగా శుక్రవారం విద్యార్థిని భవ్యశ్రీ రూ.ఐదు వేల నగదు బహుమతి, షీల్డు, ప్రశంసాపత్రం అందుకుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని సాధించిన భవ్యశ్రీని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, విద్యా కమిటీ చైర్మన్ ఎ.చక్రధర్, ఉపాధ్యాయులు టి.గోవిందు, వి.రాజు, కేవీవీ సత్యనారాయణ, ఏఎల్‌వీ కుమారి, ఎ.శ్రీవల్లి అభినందించారు.

నవర విద్యార్థిని ప్రతిభ

సామర్లకోట: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కాకినాడ, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో సేవ్ ద గర్ల్ చైల్డ్ అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలలో సామర్లకోట మండలం నవర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని దీప్తి వెంకటలక్ష్మి మంచి ప్రతిభ కనబర్చింది. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో దీప్తి వెంకటలక్ష్మికి ద్వితీయ బహుమతి వచ్చిందని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సత్యవతి తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆ విద్యార్థినికి రూ.మూడు వేల నగదు బహుమతి, షీల్డ్ అందజేశారని చెప్పారు. పోటీల్లో పాల్గొనడానికి తర్ఫీదు ఇచ్చిన ఉమామహేశ్వరరావు, విద్యార్థి వెంకటలక్ష్మిని హెచ్‌ఎం సత్యవతి, విద్యా కమిటీ చైర్మన్ కుంచే దుర్గ రాంబాబు, వైస్ చైర్మన్ గవ్వా హేమ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుల భూమికి హామీ రీ సర్వే

తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రైతుల స్వాధీనంలో ఉన్న భూమికి హామీగా రీ సర్వే ఉంటుందని తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిళ్లదొడ్డి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారం కోసం ఈ రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతుల దస్తావేజులోను, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు అయితే.. రీ సర్వేలో మార్పు చేసి, సమస్యను పరిష్కరిస్తారని వివరించారు. భూములకు సంబంధించిన వాస్తవ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించవలసి ఉంటుందన్నారు. అవసరమైన సమయంలో నోటీసులు ఇచ్చి, రైతులకు న్యాయం చేస్తారని చెప్పారు. ప్రతి ఒక్క రైతు ఈ రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని, అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామ సభలో సాయంత్రం వరకు 26 అర్జీలు వచ్చాయని చెప్పారు. సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని నాలుగు, పట్టాదారు పాస్ పుస్తకంలో పేరు మార్పు కోసం రెండు, సర్వే నంబరు సవరణకు ఒకటి, తన భూమికి ఆధార్, ఫోన్ నంబరు తప్పుగా పడిందని మూడు, డీ పట్టా ఫ్రీహోల్డ్ చేయాలని రెండు, రీసర్వేలో విస్తీర్ణం తగ్గిందని 14 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వివరించారు. శనివారం మాధవపట్నం గ్రామంలో గ్రామ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు సీహెచ్ నరసింహమూర్తి, బి జనార్దన్, బీఎస్ఎస్ రామకృష్ణ, సీహెచ్ స్వాతి, వీఆర్వోలు కె చంద్రబాబు, ఆర్ కొండలరావు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



కుతుకుడుమిల్లిలో దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా విక్రయించే దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దుకాణాలు ఏర్పాటు చేయనున్న స్థలాలను శుక్రవారం ఎస్సై వెంకటేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, పోలీసులు, పొల్యూషన్ శాఖలకు సంబంధించిన అనుమలుతు తప్పని సరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులు ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందుగుండు సామగ్రిని అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వహకులే వహించాలన్నారు. దుకాణాలు ఏర్పాటుకు ఇప్పటివరకూ 11 దరఖాస్తులు అందాయన్నారు. వీటిని పరిశీలించి, విచారణ చేసి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. షాపులను రేకులతోనే ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశు గణనకు అందరూ సహకరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ పద్మావతి

పెద్దాపురం: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పశుగణన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, ఎంపీడీఓ శ్రీలలిత అన్నారు. 21వ అఖిల భారత పశుగణన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ పెద్దాపురం ఏడీఏ తుమ్మల రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల ఇంటికి వచ్చి పశుగణన సమాచారం సేకరిస్తారని, రైతులు పశు సంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు. తద్వార పశుగణన రంగ పథకాల రూపకల్పను ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

హమ్మయ్యా.. స్పందించారు



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో గుంతలను పూడ్చుతున్న దృశ్యం

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. కొత్తపల్లి మండలంలోని రహదారులు అడుగడుగునా గోతలతో ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై బుధవారం ‘ప్రయాణం..ప్రాణ సంకటం’ శీర్షికతో ‘సాక్షి’ కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన అధికారులు హుటాహుటీన రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. ఉప్పాడ-పిఠాపురం రోడ్డులోని గోతులను కంకరతో పూడుస్తున్నారు.

28న కాకినాడలో ధర్నా

పిఠాపురం: వలంటీర్లకు ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారం కోసం ఏపీ గ్రామ/వార్డు వలంటీర్ల అసోసియేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 28న కాకినాడ కలెక్టరేట్‌లో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండలాధ్యక్షులు నందేశ్వరరావు వలంటీర్లకు పిలుపునిచ్చారు. పిఠాపురంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వలంటీర్లను కొనసాగిస్తామని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీ అమలు కోరుతూ ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకూ అనేక మంత్రివర్గ సమావేశాలు జరిగినా వలంటీర్ల సమస్యను కనీసం చర్చించలేదన్నారు. రాష్ట్రంలో 2.60 లక్షల మంది వలంటీర్లు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని, వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించేంతవరకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ వార్డు వలంటీర్ల అసోసియేషన్ జిల్లా కో కన్వీనర్ ఎ.ప్రకాష్, సీహెచ్ అప్పారావు, కుమార్, కె.ఉమాదేవి, డి.నాగమణి తదితరులు పాల్గొన్నారు

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం



ఆర్‌బీ పట్నం పాఠశాలకు కుర్చీలు బహూకరిస్తున్న యువత

పెద్దాపురం: సమాజంలో విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని మండలంలోని ఆర్‌బీ పట్నం హైస్కూల్ హెచ్‌ఎం మల్లేశ్వరరావు అన్నారు. స్కూల్ చైర్మన్ మన్యం చిన్న ఆధ్వర్యంలో గ్రామ యువత శుక్రవారం సుమారు రూ,20 వేల విలువైన కుర్చీలను పాఠశాలకు బహూకరించారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం మల్లేశ్వరరావు మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి ప్రభుత్వ పథకాలతో పాటు, దాతల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. పాఠశాల అవసరాన్ని గుర్తించిన యువతను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫణీంద్ర, దాతలు మన్యం ప్రసన్నకుమార్, కల్తూరి శ్రీను, పెనుమర్తి దొరబాబు, సానిపిని సురేష్,,నల్లల శ్రీను, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లతో బాధ్యతగా మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి

పెద్దాపురం: సమాజంలో సీనియర్ సిటిజన్లతో ప్రతి విద్యార్థి బాధ్యతగా మెలగాలని స్థానిక మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులపై గౌరవం, బాధ్యత, ప్రేమాభిమానాలతో మెలగాలన్నారు. వృద్ధుల కోసం కేంద్ర ప్రభుత్వం 2007లో చట్టాలు చేసిందని, ఏపీ ప్రభుత్వం 2011లో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిందన్నారు.

ఆస్పత్రికి ఏసీ వితరణ



ఆస్పత్రికి ఏసీని అందజేస్తున్న నాయకులు

సామర్లకోట: ముస్లిం సంఘ నాయకులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం ఏసీని బహూకరించారు. ఇటీవల ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా, ముఖ్యమైన విభాగాల్లో ఏసీ లేకపోవడం వలన ఇబ్బంది కలుగుతుందని ఆస్పత్రి సిబ్బంది కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. ముస్లిం సంఘ నాయకులు ఎండీ షఫీఉల్లా, ఎండీ సైఫుల్లా జమతుల్ ఖురేష్ సంఘం తరఫున రూ.40 వేల విలువైన ఏసీని ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ అమలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కుతుకుడుమిల్లిలో అన్నసమారాధన

కొత్తపల్లి: కుతుకుడుమిల్లి మార్కెట్‌లో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సాయిప్రియ సేవా సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కుతుకుడుమిల్లి, వాకతిప్ప, కొత్తపల్లి తదితర గ్రామాల నుంచి సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దాపురం డివిజన్‌లో కౌన్సెలింగ్ సెంటర్

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
- ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు

ప్రత్తిపాడు: భార్యాభర్తల మధ్య తగాదాలను పరిష్కరించేందుకు పెద్దాపురం డివిజన్‌లో డివిజన్ స్థాయి కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో ప్రమాదాలు తగ్గాయన్నారు. జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించనున్నందున మరింతగా ప్రమాదాలను నివారించేందుకు సీఐ, ఎస్సైలతో హైవేపై పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశించారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. యువత ఒడిశా సరిహద్దుకు వెళ్లి గంజాయిని మన రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. గంజాయి రవాణా, క్రయవిక్రయాలు, వినియోగించే వారిపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామన్నారు. కళాశాల, పాఠశాలల వద్ద జరుగుతున్న ఈవ్‌టీజింగ్‌ను అరికట్టేందుకు పోలీస్, మహిళా పోలీసులతో జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడమే కాక ఫోక్సో కేసులపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఉత్తరకంచి స్టేట్ బ్యాంకు దోపిడీ కేసును చేదించామన్నారు. ప్రత్తిపాడు ప్రాంతంలో ఎక్కువగా భూ తగాదాలు, పాయిజన్ కేసులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్, డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐ బి.సూర్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాత ఇసుకపల్లిలో రీ సర్వే గ్రామ సభ



పాత ఇసుకపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని పాత ఇసుకపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. శనివారం నాగులపల్లి-1 సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.